క్లుప్తంగా

20న సర్వసభ్య సమావేశం

హన్మకొండ అర్బన్: నగరంలోని రెవెన్యూ కాలనీ ఎస్సార్ మ్యాచువల్లి ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని ఏప్రిల్ 20న నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పొలాడి రంగారావు, వేముల అనంతరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2019లో సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి పాలకవర్గం సమావేశం ఒకసారి కూడా జరపలేదని, సొసైటీ పేరున ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతా తీయలేదని, ఫోర్జరీ సంతకాలతో మెంబర్‌షిప్ చేయించడం, భూమి అమ్మిన డబ్బులను బ్యాంక్‌లో జమ చేయకపోవడానికి ఎవరు సమాధానం చెప్పలేదని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హసన్‌పర్తి: ఎల్లాపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీ అశోక్ తెలిపారు. ఈమేరకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్



హసన్‌పర్తి: నగరంలోని సహస్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న సూత్రపు శ్రీనివాస్ పంజాబ్‌లోని లవ్లీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. 'ఎక్స్‌ట్రాక్షన్, నార్మకాలజికల్ అండ్ ఫార్మా కోఇన్ఫర్మాటిక్ ఎవల్యూషన్ ఆఫ్ పొటెన్షియల్ యాంటీ డయాబెటిక్ ఏజింట్స్' అనే అంశంపై ప్రొఫెసర్ రష్మ సక్సెనాపాల్, డాక్టర్ పిల్లి గోవిందయ్య పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ లభించింది.

ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్‌కు అభినందన




కేయూ క్యాంపస్: కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ సమైక్యత శిబిరానికి హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థి, ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్ యాకూబ్ పాల్గొన్నాడు. ఈ మేరకు ఆయనను కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు కనకయ్య, శ్రీదేవి గురువారం అభినందించారు.

అనాథ వృద్ధుడికి చేయూత



హసన్‌పర్తి: ఎర్రగట్టు గుట్ట ప్రాంతంలోని హోటళ్లల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అనాథ వృద్ధుడిని ఓ బీఆర్‌ఎస్ నేత ఆదుకున్నాడు. ఈమేరకు హసన్‌పర్తికి చెందిన వృద్ధుడు వీరభద్రయ్య పరిస్థితిని చాతళ్ల వేణుగోపాల్ గమనించి భీమారంలోని లార్డ్ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులకు సమాచారం అందించి అనాథాశ్రమంలో గురువారం చేర్పించారు.

ఆహ్వాన పత్రిక అందజేత



ఖిలా వరంగల్: మైసూర్‌లోని ఉత్తర పీఠాధిపతి దత్త విజయానంద తీర్థస్వామిని వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2నుంచి 4వ తేదీ వరకు సీతారామచంద్ర స్వామి ఆలయంలో జరగనున్న కుంభాభిషేక మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రికను స్వామిజీకి అందజేశారు. కార్యక్రమంలో రావికంటి అశోక్, ఆడెపు శ్యాంకుమార్, కొండి రాజమౌళి, యాదగిరి, మంచాల కృష్ణమూర్తి, శ్రీరాంరాజేష్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

హన్మకొండ అర్బన్: హనుమకొండ బార్ అండ్ రెస్టారెంట్ జిల్లా అసోసియేషన్ సమావేశం సుబేదారిలో గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్ధం రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడిగా రవీందర్, కోశాధికారిగా కృష్ణాకర్, సంయుక్త కార్యదర్శిగా దీరజ్ రెడ్డి, సభ్యులుగా కేశవరావు, నవీన్‌రావు, సాయిని రమణ, వెంకటేశ్వర్, మోహన్‌రావు, విజయ్‌ను ఎన్నుకున్నారు.

బెనిఫిట్స్ ఇవ్వాలి

ఖిలా వరంగల్: రిటైర్మెంటైన అంగన్‌వాడీ ఆయాలకు ప్రభుత్వం ప్రకటించిన సర్వీస్ బెనిఫిట్స్‌ను వెంటనే ఇవ్వాలని శివనగర్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా ఇడబోయిన రాజమ్మ కోరారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని 90వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆమె గురువారం మాట్లాడారు. తాను ఆయాగా 30 ఏళ్లు సర్వీస్ చేసి 2024, మార్చిలో రిటైర్మెంట్ అయ్యానని, రిటైర్మెంట్ సమయంలో రూ.లక్ష వరకు సర్వీస్ బెనిఫిట్స్ అందజేస్తామని అధికారులు హామీ ఇచ్చారని, ఏడాది గడిచినా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని రాజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

జనావాసాలు.. మురికి కూపాలు!



పరకాల రహదారి వెంట జనావాసాల్లో నిలిచిన మురుగు నీరు



11వ వార్డులో ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన మురుగు నీరు

- డ్రెయినేజీ లేక స్థానికుల ఇబ్బందులు
- వేధిస్తున్న దోమల బెడద
- అధికారులు స్పందించాలని డిమాండ్

కమలాపూర్ : మండల కేంద్రంలోని పలు కాలనీల్లో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక జనావాసాలు మురికి కూపాలుగా మారాయి. మురుగు నీటిలో పందులు స్వైరవిహారం చేస్తుండటంతో భరించలేని దుర్వాసనతో పాటు రోజురోజుకు దోమల వ్యాప్తి పెరిగిపోయి ఆయా కాలనీల వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో తాము రోగాల బారిన పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు స్పందించి తమ కాలనీల్లో డ్రెయినేజీలు నిర్మించాలని ఆయా కాలనీల వాసులు వేడుకుంటున్నారు.

సీసీ నిర్మించి డ్రెయినేజీ మరిచారు..

కమలాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి డబుల్ బెడ్రూం ఇళ్ల వైపు వెళ్లే మార్గంలో ఉన్న 16వ వార్డులో సీసీ రోడ్డు నిర్మించిన అధికారులు, కాంట్రాక్టర్లు ఇప్పటి వరకు డ్రెయినేజీ మాత్రం నిర్మించలేదు. దీంతో మురుగు నీరంతా ఆ కాలనీ వాసుల ఇళ్ల ముందే నిలిచిపోయి దుర్వాస వెదజల్లుతుంది. దీంతో దోమల వ్యాప్తి పెరిగిపోతోంది. డ్రెయినేజీ నిర్మించాలని పాలకులను, అధికారులను వేడుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా మాట్ల ఆనందం ఇంటి నుంచి డబుల్ బెడ్రూం ఇళ్ల వైపు మురుగు కాల్వ నిర్మించినప్పటికీ ప్రణాళిక లేమితో మురుగు నీరు బయటకు వెళ్లే దారి లేక కాల్వల్లోనే పేరుకుపోతోంది. ఇదిలా ఉండగా హుజూరాబాద్–పరకాల ప్రధాన రహదారి వెంట డ్రెయినేజీలు లేక జనావాసాల్లో మురికి నీరంతా పేరుకుపోతోంది.

11వ వార్డు వీధుల్లో ప్రవహిస్తున్న మురుగు..

కమలాపూర్‌లోని 11వ వార్డులో కాల్వలు లేక మురుగు నీరంతా వీధుల్లో ప్రవహిస్తోంది. ఆ మురుగంతా జనావాసాలకు సమీపంలో పేరుకుపోయి భరించలేని దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి విపరీతంగా పెరిగిపోతోంది. ఇక వర్షాకాలంలోనైతే వరద, మురుగు ఏకమై ప్రవహిస్తుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలంటున్నారు.



11వ వార్డులోని ఓ వీధిలో మురుగు నీరు



16వ వార్డులో ఇళ్ల పక్కనే నిలిచిన మురుగునీరు

కాల్వలు నిర్మించాలి



మా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించిన అధికారులు కాల్వ మాత్రం ఇప్పటి వరకు నిర్మించలేదు. దీంతో ఇళ్ల సమీపంలోనే మురుగునీరు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. దోమల వ్యాప్తి పెరిగిపోయి రోగాల బారిన పడుతున్నాం. వీలైనంత త్వరగా కాల్వలు నిర్మించాలి.

– దారంగుల లక్ష్మి, స్థానికురాలు

ఇళ్ల ముందే మురుగునీరు



తమ కాలనీలో కాల్వ లేని కారణంగా మురుగు నీరంతా ఇళ్ల సమీపాల్లోనే నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమల వ్యాప్తి పెరిగిపోతోంది. కాలనీ వాసులు జ్వరాల బారిన పడుతున్నారు. మురుగు కాల్వలు నిర్మించాలని అధికారులను వేడుకున్నా ఎవరూ స్పందించడం లేదు.

– మొగిలిచెర్ల సారంగం, స్థానికుడు

సంక్షిప్తంగా

పౌల్ట్రీ షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన



వేలేరు : మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పౌల్ట్రీ షెడ్డు నిర్మాణ పనులను ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పౌల్ట్రీ షెడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులను గడువులోగా పూర్తిచేయాలని సూచించారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఐనవోలు: ఐనవోలు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు యూత్ ప్రతినిధులు చిరంజీవి, రాజు, జాన్సన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రికెట్ ఈనెల 29 నుంచి ప్రారంభం కానుందని, పాల్గొనాల్సిన జట్లు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించాలని తెలిపారు. దాతలు టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మొదటి బహుమతి రూ.25,016, ద్వితీయ బహుమతి అద్దంకి ఇంద్రయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు రూ.12,016 అందించనున్నట్లు తెలిపారు. అలాగే తృతీయ బహుమతి వడిచర్ల శ్రీను జ్ఞాపకార్థం దత్తాద్రి ఫౌండేషన్ వారు రూ.7,016 అందజేస్తున్నట్లు తెలిపారు. మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్ దాత బొల్లెపల్లి సుధాకర్ జ్ఞాపకార్థం కుమారుడు బొల్లెపల్లి ప్రణయ్ అందిస్తున్నట్లు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలనుకునే వారు ఇతర వివరాలకు నిర్వాహకులు చిరంజీవి 9010256736, రాజు 9177792875, జాన్సన్ 9642832305 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఎన్నిక



శాయంపేట : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మండల కార్యవర్గాన్ని గురువారం మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘం ఆవరణలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సామల మధుసూదన్ ఇటీవల ఎన్నిక కాగా గౌరవ అధ్యక్షులుగా వావిలాల వేణుగోపాల ప్రసాద్, కందగట్ల ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా బాసని చంద్రమౌళి, గుర్రం అశోక్, ప్రధాన కార్యదర్శిగా సామల రవీందర్, కోశాధికారిగా రంగు శ్రీధర్, సహాయ కార్యదర్శులుగా బడుగు రవీందర్, బాసాని సదాశివుడు, కార్యనిర్వాహకుడిగా బాసాని నాగభూషణం, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌లుగా బడుగు అశోక్, దాసి శ్రావణ్‌కుమార్, ముఖ్య సలహాదారులుగా పల్నాటి జలేందర్, బాసాని లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య, మల్లయ్య, కుమారస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకుడు బాసాని చంద్రప్రకాశ్ వెల్లడించారు.

పీఆర్టీయూ నాయకుల పరామర్శ

పరకాల : పీఆర్టీయూ వ్యవస్థాపక సభ్యుడు, ఉపాధ్యాయుడు దావు రమేశ్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆ సంఘం రాష్ట్ర నాయకులు బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. మృతుడు ఆగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు కురుమ పున్నంచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేతి మహేందర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పసుల శంకర్, ఉపాధ్యక్షుడు మేకల సంతోశ్, నాయకులు రమేశ్, కుమారస్వామి, ఎల్కంటి శరత్, నరేశ్‌కుమమార్, రమేశ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాళంవేసిన ఇంట్లో చోరీ

- 7 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.35 వేల నగదు అపహరణ

ఎల్కతుర్తి : తాళం వేసిన ఇంట్లో దండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలంలోని రాంనగర్‌లో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై దివ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మండల కుమారస్వామి వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 7తులాల బంగారం, 20 తులాల వెండితో పాటు రూ.35వేల నగదు అపహరించినట్లు తెలిపారు. బాధితుడు వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చి చూడగా తలుపులు, బీరువా తెరిచి ఉండడంతో పాటు బట్టలు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దీంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

యాంత్రీకరణ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

దామెర/నడికూడ : వ్యవసాయ యాంత్రికరణ పథకంలో భాగంగా మండలంలోని రైతులు వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని దామెర, నడికూడ ఏఓలు రాకేశ్, జైసింగ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలోని ఎస్సీ, ఎస్టీ మహిళ, జనరల్ రైతులు ఈనెల 29వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, రోటోవేటర్లు, కల్టివేటర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. అదే విధంగా నియోజకవర్గ కోటాలో పవర్ టిల్లర్, పవర్ వీడర్, బ్రష్ కట్టర్, బండ్ ఫార్మర్, వరిగడ్డి చుట్టే యంత్రం, డ్రోన్, ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తుతో పాటు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ జిరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జతచేసి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు.

సినీనటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలు

పరకాల : సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదిన వేడుకలను పట్టణంలో గురువారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమాన సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొచ్చు భాస్కర్ ఆధ్వర్యంలో జయ డీలక్స్‌లో కేక్ కట్ చేశారు. కోడెల రమేశ్, లావణ్య, దివ్యశ్రీ, కుమార్, సురేశ్, కళారాజు, అక్షిత పాల్గొన్నారు.

దేవాదుల ప్రాజెక్టులో కడియం పాత్ర జీరో


- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: దేవాదుల ప్రాజెక్టులో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాత్ర గుండు సున్నా అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆరోపించారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజయ్య మాట్లాడారు. కడియంపై ఘాటు విమర్శలు చేశారు. చీటికి మాటికి దేవాదుల సృష్టికర్తగా చెప్పుకునే కడియం శ్రీహరి పాత్ర వాస్తవానికి దేవాదుల ప్రాజెక్టులో ఇసుమంతైనా లేదని ఎద్దేవా చేశారు. దేవాదుల తొలి రెండు దశల పనుల్లో కడియం ఏమాత్రం సహకరించలేదని, ఆ మాటకొస్తే గతంలో దేవాదుల నుంచి నీటిని విడుదల చేస్తుంటే అడ్డుకున్న చరిత్ర ఆయనదని విమర్శించారు. గత 15 సంవత్సరాలుగా దేవాదుల ప్రాజెక్టు కోసం ఎలాంటి కృషి చేయని కడియం ప్రస్తుతం ఆఘమేఘాల మీద హెలికాప్టర్‌లో పంప్‌హౌజ్ వద్దకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు తాటికొండ సురేష్, కనకం గణేష్, మారెపల్లి ప్రసాద్, చింత శ్రీను, గుండె మల్లేష్, బి.మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



కాజీపేట అర్బన్: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై రామారావు సూచించారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని శ్రీరాజరాజేశ్వరి ఆటో యూనియన్ అడ్డాలో ట్రాఫిక్ నియంత్రణపై డ్రైవర్లకు ఎస్సై రామారావు గురువారం అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు. ట్రాఫిక్ సిబ్బంది, యూనియన్ నాయకుడు సాంబమూర్తి, కోశాధికారి సురేష్ ఉన్నారు.

మార్కెట్‌లో మజ్జిగ పంపిణీ

వరంగల్: పెరుగుతున్న ఎండల దృష్ట్యా వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధుల అభ్యర్థన మేరకు రైతులు, గుమాస్తాలు, కార్మికులు, వ్యాపారస్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ ఉప్పుల శ్రీనివాస్ తెలిపారు. మార్కెట్‌లోని మిర్చి యార్డు వద్ద చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి, ఉన్నత శ్రేణి కార్యదర్శి జి.రెడ్డితో కలిసి మజ్జిగ ప్యాకెట్లను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 27 నుంచి మే నెల చివరి వరకు రోజూ 4వేల వరకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తామని తెలిపారు. మార్కెట్ గ్రేడ్ –2 కార్యదర్శులు రాము, అంజిత్‌రావు, ఏఎస్ రాజేందర్, చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాష్, కోశాధికారి అల్లె సంపత్, కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, అడ్తి సెక్షన్ అధ్యక్షుడు ఎన్‌రెడ్డి లింగారెడ్డి, గుమాస్తా సంఘం అధ్యక్షుడు ఎనుముల మల్లేశం, కార్యవర్గ సభ్యులు, హమాలీ కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ చేయాలి

- తహసీల్దార్‌కు యువసేన ఎన్‌జీఓ నాయకుల విజ్ఞప్తి



కమలాపూర్ : తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌జీఓ సభ్యులు

కమలాపూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే బీసీ, ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు కుల, ఆదాయ సర్టిఫికెట్లు సకాలంలో జారీ చేయాలని యువసేన ఫౌండేషన్ ఎన్‌జీఓ అధ్యక్షుడు మండ అశోక్ కోరారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ సురేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో రాజీవ్ యువ వికాసం పథకానికి శ్రీకారం చుట్టి సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించిందని, ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తప్పనిసరని పేర్కొందన్నారు. పలువురు నిరుద్యోగులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కుల, ఆదాయ ధృవీకరణ పత్రాల కోసం మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని, కానీ వారం రోజులైనా సర్టిఫికెట్లు దరఖాస్తుదారులకు అందలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్టిఫికెట్లను త్వరితగతిన జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ సభ్యులు చిలుక రాజేందర్, బైరి రాజేశ్, కిన్నెర మచ్చేందర్, మౌటం శ్రీను, బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పొడిగించాలి

ఎల్కతుర్తి : ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాస పథకానికి గడువు పొడిగించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులం, ఆదాయం సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో గడువు పొడగించాలని ఆయన కోరారు. అలాగే అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాని కోరారు.

యువవికాసాన్ని వినియోగించుకోవాలి

ఆత్మకూరు : రాజీవ్ యువ వికాసం పథకాన్ని నిరుద్యోగులు వినియోగించుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తనుగుల సందీప్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. యువత ఎదుగుదలకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. వేణు, రాజ్‌కుమార్, రమేశ్, శ్రీశైలం, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాబోధనను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఐనవోలు : పీఎంశ్రీలో భాగంగా ఒంటిమామిడిపల్లి ఉన్నత పాఠశాలకు మండలంలోని గర్మిళ్లపల్లి, ముల్కలగూడెం, పెరుమాండ్లగూడెం యూపీఎస్ విద్యార్థులు పాఠశాలల జంటీకరణ (ట్విన్నింగ్ ఆఫ్ ది స్కూల్స్) కార్యక్రమంలో భాగంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రీడా పరికరాలు తదితరాలను పరిశీలించారు. వాటి ద్వారా తరగతి గదిలో జరుగుతున్న బోధన విధానాలను అడిగి తెలుసుకున్నారు. గురువారం ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన కార్యక్రమానికి జిల్లా క్వాలిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసు హాజరై మాట్లాడారు. ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఇక్కడ పరిశీలించిన అంశాల ద్వారా ఉన్నత పాఠశాలల్లో కల్పించే అనేక సౌకర్యాలను వినియోగించుకోవాలని అన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానానికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఇలాంటి కార్యక్రమం విద్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఎంఈఓ ఆనందం, హెచ్‌ఎం సదానందం, ఏఏపీసీ చైర్ పర్సన్ సకినాబి, నవీన్, రాజు, ఆనందం, ఇబ్రహీం, కరుణాకర్, రఫీ పాల్గొన్నారు.

'చంద్రగిరి'ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- బీజేపీ రాష్ట్ర నాయకుడు కాళీప్రసాదరావు



చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న కాళీప్రసాదరావు

దామెర : మండలంలోని చంద్రగిరిని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు అన్నారు. మండలంలోని కోగిల్వాయి సమీపంలో చంద్రగిరి చెన్నకేశవస్వామిని గురువారం ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే చెన్నకేశవస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చంద్రగిరి గుట్టలపై మూడు గుడులు, ఏడు కోనేరులు ఉండటం విశేషమని ఆయన పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చంద్రగిరి గుట్టను పర్యాటక ప్రదేశంగా గుర్తించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు గురిజాల శ్రీరాంరెడ్డి, ముత్యాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు జంగిలి నాగరాజు, ముల్క ప్రసాద్, మాదారపు రతన్ కుమార్, రమణారెడ్డి, సూర చందర్, కొట్టె రమేశ్, సాంబయ్య, రవి, రాజు, శ్రీను, చుక్క మహేందర్, కార్యకర్తలు ఉన్నారు.

పొగాకు ఉత్పత్తులు రవాణా చేస్తే కేసులు

- సీఐ పులి రమేశ్



పొగాకు ఉత్పత్తులను రవాణా చేసిన వ్యక్తిని అరెస్టు చూపుతున్న సీఐ పులి రమేశ్

ఎల్కతుర్తి : పొగాకు ఉత్పత్తులు రవాణా చేస్తే కేసులు తప్పవని సీఐ పులి రమేశ్ హెచ్చరించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. భీమదేవరపల్లి మండలం కొత్తకొండలో గురువారం సాయంత్రం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పొగాకు ఉత్పత్తులను రవాణా చేస్తున్న ఆటోను పట్టుకున్నట్లు తెలిపారు. కొత్తకొండ గ్రామానికి చెందిన మహ్మద్ హుస్సేన్ బాబా కొప్పూరు గ్రామానికి చెందిన ఆకుల రవీందర్ వద్ద పొగాకు త్పుత్తులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. వాటిని కొత్తకొండలో ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ముచేసుకునేందుకు ఆటోలో తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన పొగాకు ఉత్పత్తుల విలువ సుమారు రూ.19,993 ఉంటుందని తెలిపారు. ఆటోను సీజ్ చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఏఎస్సై సంపత్, సిబ్బంది పాల్గొన్నారు.

కేడీసీలో ముందస్తు ఉగాది వేడుకలు



కేడీసీలో ఉగాది వేడుకలకు సంప్రదాయ దుస్తులతో హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

విద్యారణ్యపురి: కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉగాది వేడుకలను గురువారం నిర్వహించారు. కళాశాలలో తెలుగు, బాటనీ విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి మాట్లాడుతూ తెలుగు సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ వంటకాలతో ఫెడ్ ఫెస్టివల్ నిర్వహించారు. అలాగే, ఆయా విభాగాల అధ్యాపకులు సంప్రదాయ దుస్తుల్లో అలరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, స్టాఫ్ సెక్రటరీ రవికుమార్, తెలుగు విభాగం అధిపతి సత్యనారాయణ, బాటనీ విభాగం అధిపతి కోమల, అధ్యాపకులు మమత, సాయిలు, రమేష్, శ్రీనివాస్, మహేందర్, సీతారాం, శ్యాంప్రసాద్, సమ్మయ్య, యుగేందర్, నరేందర్, మన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.